క్లుప్తంగా

సత్యగంగమ్మ ఆలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కింపులో పాల్గొన్న సిబ్బంది

పలమనేరు: పట్టణంలోని పాతపేట సత్యగంగమ్మ ఆలయంలో బుధవారం హుండీలోని కానుకలను లెక్కించారు. నాలుగు నెలలకు సంబంధించి రూ.1,80,770 ఆదాయం వచ్చిందని ఈవో కమలాకర్ తెలిపారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, అమ్మవారి భక్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా ఐటీ విభాగం సెక్రటరీగా ఇంద్రేష్



పలమనేరు/వి.కోట: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చిత్తూరు జిల్లా ఐటీ విభాగం సెక్రటరీగా వి.కోట మండలానికి చెందిన ఇంద్రేష్ యాదవ్‌ను నియమించినట్టు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి బుధవారం ఆదేశాలందాయి. తనపై నమ్మకం ఉంచి జిల్లా స్థాయి బాధ్యతలు అప్పగించినందుకు మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పీహెచ్‌సీకి సిబ్బందితో మాట్లాడుతున్న మలేరియా అధికారి వేణుగోపాల్

పలమనేరు: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో దోమలు వృద్ధి చెంది జ్వరాలు, ఇతర సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండేలా ఆరోగ్య సిబ్బంది క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా ఆఫీసర్ వేణుగోపాల్ సూచించారు. ఆయన బుధవారం కొలమాసనపల్లి పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ దోమకాటుతో మలేరియా, డెంగీ, చికున్‌గునియా తదితర జ్వరాలు ప్రబలుతాయన్నారు. రాత్రిళ్లు దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇళ్ల ముందు, పరిసరాల్లో వర్షపు నీరు నిలవకుండా చూడాలన్నారు. మెడికల్ ఆఫీసర్ అనోఖి, సబ్ యూనిట్ ఆఫీసర్ జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి



పొలం పిలుస్తోంది కార్యక్రమం పాల్గొన్న వ్యవసాయ అధికారులు, రైతులు

గంగవరం: పంటల సాగులో రసాయనిక ఎరువులు వాడకం పూర్తిగా తగ్గించి సేంద్రియ ఎరువులు వినియోగించాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ తెలిపారు. ఆయన బుధవారం తమ్మిరెడ్డిపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంటలు చేసిన ప్రతి రైతు పంటల బీమా చేసుకోవాలన్నారు. ఇందుకోసం ఎకరాకు రూ.840 ప్రీమియం చెల్లించాలన్నారు. తద్వారా ప్రభుత్వం నుంచి రాయితీలతోపాటు పంటలు దెబ్బతిన్నప్పుడు పరిహారం అందుతుందని వివరించారు. అనంతరం పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు శివకుమార్, ఏవో రఖీబా, మండల ఉద్యాన అధికారి వరప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా నరసింహ స్వామి ఆలయ కుంభాభిషేకం



శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న వేదపడింతులు

పుంగనూరు: పట్టణ సమీపంలోని గూడూరు పల్లె వద్ద నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం మహాకుంభాభిషేకాన్ని ఘనంగా చేపట్టారు. ముందుగా ఉదయం మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. హోమం నిర్వహించి మహాపూర్ణాహుతి అనంతరం స్వామివారికి తిరుమంజనం పెట్టారు. ఈ నెల 25 వరకు మహాకుంభాభిషేకం చేపట్టనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వరిసాగుకు సన్నద్ధం

ఈ ఏడాది ఖరీఫ్‌లో అదునుకు వర్షాలు కురవలేదు. దీంతో ఎక్కువ మంది రైతులు వేరుశనగ విత్తనాలు వేయలేదు. నీటి వసతి వున్న కొంతమంది రైతులు వరిసాగుపై ఆసక్తి చూపుతున్నారు. బోరు బావులు వున్న రైతులు ఇప్పటికే నారుమళ్లు సిద్ధం చేసుకుని నాట్లు వేస్తున్నారు. ప్రస్తుతం మరికొంతమంది రైతులు నారు పోసుకుంటున్నారు. గ్రామాల్లో రైతులు, కూలీలు బిజీగా వున్నారు.

- మొదలైన నారుమళ్లు, వరినాట్లు
- బిజీగా మారిన రైతులు, కూలీలు
- సూచనలు పాటించాలంటున్న వ్యవసాయశాఖ



వరిసాగుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు



వరినాట్లు వేస్తున్న కూలీలు

పలమనేరు: పలమనేరు వ్యవసాయశాఖ డివిజన్‌లో ఖరీఫ్‌లో వేరుశనగ ప్రధాన పంట. 14 వేల హెక్టార్లలో వేరుశనగ సాగవుతుంది. తర్వాత సుమారు 5 వేల హెక్టార్లలో వరి, 6 వేల హెక్టార్లలో అన్ని రకాల కూరగాయలను పండిస్తారు. ఈ ఏడాది సరైన సమయంలో వర్షాలు కురకపోవడంతో 50 హెక్టార్లలో మాత్రమే వేరుశనగ వేశారు. ప్రస్తుతం అడపాదడపా వర్షం కురుస్తున్నా పంటల సాగుకు వీలయ్యేలా లేదు. నీటి వసతి ఉన్న రైతులు వరిసాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే వరినార్లు వేసుకుని పొలాలను సిద్ధం చేసుకున్న వారు నాట్లు వేస్తున్నారు. మరికొంతమంది నార్లు పోసుకుని పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. దీంతో గ్రామాల్లో వరినాట్లతో రైతులు, కూలీలు బిజీగా మారారు. ఈ సీజన్‌లో 3 వేల హెక్టార్లలో వరిసాగయ్యే అవకాశం ఉందని పలమనేరు వ్యవసాయ సహాయసంచాలకులు గీతాకుమారి తెలిపారు. మంచి దిగుబడులను పొందాలంటే అధికారుల సూచనలు పాటించాలని సూచించారు.

విత్తనాల ఎంపిక ఇలా

రైతులకు వున్న నీటి వసతిని బట్టి స్వల్పకాలిక, మధ్య కాలిక రకాలను ఎంపిక చేసుకోవాలి. అంటే 135 రోజుల పంటవ్యవధి గల ప్రస్తుత మార్కెట్‌లోని రకాలు ఎంపిక చేసుకుంటే మంచిది. లైసెన్సు కలిగిన డీలర్ వద్ద విత్తనాలు కొనుగోలు చేయాలి. ముఖ్యంగా సంచిపై ఉన్న వివరాల్లో మొలక శాతం తదితరాలను గమనించాలి. వారి నుంచి విధిగా రసీదు పొందాలి.

ప్రధాన పొలం తయారీనే చాలా ముఖ్యం

పొలాన్ని రెండు మూడు సార్లు బాగా కలియదున్నాలి. మడిలో నీరు ఎక్కువగా లేకుండా బురద పదునులేక పెరుగు పదును ఉండేలా చూసుకోవాలి. పొలంలో ఇసుక ఎక్కువగా ఉంటే ఒక ఇంచ్ నీరు ఉండేలా చూసుకోవాలి. కయ్యలో సమానంగా విత్తనాలు పడేలా చూసుకోవాలి. చదరపు మీటర్‌కు 44 కుదుళ్లు (కుదురుకు రెండు లేదా మూడు మొక్కలు) ఉండేలా చూడాలి. శ్రీవరి సాగు చేస్తే రైతులకు మరింత మేలు కలుగుతుంది.



నాటడానికి సిద్ధంగా ఉన్న వరి నారు

వరిసాగుకు మూడు పద్ధతులు

వరిని మూడు ప్రధాన పద్ధతుల్లో సాగు చేస్తారు. నారును పెంచి తిరిగి ప్రధాన పొలంలో నాటడం, నేరుగా విత్తనాలను ప్రధాన మడిలో చల్లడం, మొలకెత్తిన విత్తనాలను డ్రమ్‌సీడర్ ద్వారా పొలంలో విత్తడం. డ్రమ్‌సీడర్ లేదా నేరుగా విత్తనాలను చల్లే పద్ధతుల్లో రైతుకు సాగుకు అయ్యే ఖర్చులో ఎకరాకు రూ.మూడు వేలకు పైగా తగ్గించుకోవచ్చు. కూలీల సమస్యను అధిగమించవచ్చు. విత్తన ఖర్చు తగ్గుతుంది. పంటకాలం కూడా పది రోజులు తగ్గించుకోవచ్చు. మొక్కల సాంద్రత సరిపడా ఉంటుంది. దిగుబడి ఎకరాకు మూడు బస్తాలు అధికంగా వస్తుంది.

భూసార పరీక్షలు చేసుకుంటే మేలు



పంటసాగుకు ముందు రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేసుకోవాలి. ఫలితాలను బట్టి ఎరువులు వాడాలి. అలాగే వరి సాగుచేసే వారు లేత నారు కొనలు కట్ చేసి నాటుకోవాలి. వరిమడిలో కాలిబాటలు ఏర్పాటుచేస్తే మొక్కకు గాలి, వెలుతురు బాగా తగులుతుంది. నత్రజని ఎరువును మూడు భాగాలుగా వేయాలి. నాట్లు వేసే ముందు దుమ్ములోనూ, పిలక దశలో, వెన్ను విడిచే సమయం కంటే ముందు పొలాన్ని బురద పదునులో ఉంచి నత్రజనిని సమానంగా వెదజల్లాలి. పంట పిలక దశలో వున్నప్పుడు పొటాష్‌ను రెండు దఫాలుగా వేసుకోవాలి. – గీతాకుమారి, ఏడీ, పలమనేరు

వైఎస్సార్ సీపీ నాయకుడికి నివాళి



క్రిష్టప్పకు నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పెద్దపంజాణి: మండలంలోని కమ్మినాయునిపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, రాజుపల్లి ఎంపీటీసీ మునీశ్వరి భర్త క్రిష్టప్ప అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు బుధవారం కమ్మినాయునిపల్లికి చేరుకున్నారు. మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. క్రిష్టప్ప మృతి పార్టీకి తీరనిలోటని చెప్పారు. అదే విధంగా వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాగారెడ్డి, ఎంపీపీ రెడ్డెప్ప, వైస్ ఎంపీపీ జీడీ బాబు, మాజీ ఎంపీపీ విజయభాస్కర్ రెడ్డి, ఎంపీటీసీ గురుమూర్తి, సర్పంచ్ రవికుమార్, నాయకులు రాజారెడ్డి, తమ్మిరెడ్డి, శంకర్‌రెడ్డి, భానుప్రతాప్ రెడ్డి, రాజేష్‌రెడ్డి, మంజునాథ రెడ్డి, పృథ్వీ తదితరులు నివాళులర్పించారు.

నేడు దుర్యోధన వధ

సదుం: మండలంలోని భట్టువారిపల్లెలో పెద్దిరెడ్డి భాస్కర్ రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో మహాభారత యజ్ఞం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం దుర్యోధన వధ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం 4 గంటలకు నిర్వహించే ప్రత్యేక పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానం పొందిన ఉపాధ్యాయులతో మండల విద్యాశాఖ అధికారులు

పులిచెర్ల(కల్లూరు) : పులిచెర్ల మండలం నుంచి బదిలీపై ఇతర పాఠశాలలకు బదిలీ అయిన 27 మంది ఉపాధ్యాయులను బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. వారు విద్యార్థుల విద్యాభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు సిద్ధరామయ్య, పోకల తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో పిల్లల సంఖ్య పెంచాలి



ఫజులుపేట అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సీడీపీవో వాణిశ్రీదేవి

రొంపిచెర్ల: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్య పెంచాలని పులిచెర్ల సీడీపీవో వాణిశ్రీదేవి ఆదేశించారు. ఆమె బుధవారం రొంపిచెర్ల మండలంలోని రొంపిచెర్ల–2, ఫజులుపేట, బలిజవీధి, ఆర్‌సీ.పురం కాలనీ, ముత్యాలమ్మ గుడి వీధి అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఒక్కో అంగన్‌వాడీ కేంద్రంలో కనీసం 10 మంది పిల్లలకు తక్కువ కాకుండా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని కేంద్రాల్లో ఇద్దరు, ముగ్గురు పిల్లలు మాత్రమే ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం అంగన్‌వాడీలకు లక్షలు ఖర్చు చేస్తోందని, అవి ఉపయోగం లేకుండా పోతున్నట్టు ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేస్తున్న పాలు, కోడిగుడ్లు, కంది పప్పు, ఆయిల్, పౌష్టికాహారాన్ని సక్రమంగా అందజేయాలని సూచించారు. అంగన్‌వాడీ సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రికార్డులు, హాజరును పరిశీలించారు. ఆమె వెంట సూపర్‌వైజర్ శిరీష ఉన్నారు.

సదుంలో తగ్గిన వేరుశనగ సాగు



సదుంలో సాగులో ఉన్న వేరుశనగ

సదుం: మండలంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో వేరుశనగ సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. తొలకరిలో వర్షాలు ఆశలు రేకెత్తించినా అదునుకు పడలేదు. దీంతో పలువురు రైతులు ఎదురు చూసి నిరాశ చెందారు. మండలంలో సాధారణంగా ఖరీఫ్‌లో 809 హెక్టార్లలో వేరుశనగ సాగు వుంటుంది. ఈ ఏడాది 40 హెక్టార్లలో మాత్రమే రైతులు వేరుశనగ పంట వేశారు. గతం వారంలో రెండు వందల ఎకరాల వరకు విత్తనాలు సాగు చేసినట్టు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం వేరుశనగ సాగుకు అనుకూలం కాదని వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలియజేయడంతో పలువురు రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ అధికారులు కోరుతున్నారు. రాయితీ ధరతో ఉలవలు పంపిణీ చేసేందుకు ప్రతిపాదనలు పంపనున్నట్లు చెప్పారు. కాగా ఖరీఫ్‌లో వరి సాధారణ విస్తీర్ణం 563 హెక్టార్లు కాగా.. ఇప్పటి వరకు 13 హెక్టార్లలో మాత్రమే సాగైంది.

ప్రహరీ గోడ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న అధికారులు

పులిచెర్ల(కల్లూరు) : కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మిస్తున్న ప్రహరీ గోడ పనులను బుధవారం మండల విద్యాశాఖ అధికారులు సిద్ధరామయ్య, పోకల తాతయ్య పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రహరీ గోడ నిర్మాణ పనులను ఉపాధి నిధులతో చేపట్టినట్టు తెలిపారు. పాఠశాల అభివృద్ధిలో భాగంగా జిల్లా కలెక్టరు ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయించారని పేర్కొన్నారు. పనులు చురుగ్గా జరుగుతున్నాయని తెలిపారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు.

వర్షాలకు దెబ్బతిన్న జాతీయ రహదారి



బండకిందపల్లె వద్ద బాక్స్‌టైప్ బ్రిడ్జిలో నిలిచిన వర్షపు నీరు



కమ్మోళ్లపల్లె అండర్ పాస్ వద్ద బురదగా వున్న రోడ్డు

రొంపిచెర్ల: చిన్నపాటి వర్షానికే మండలంలోని బెంగళూరు–తిరుపతి జాతీయ రహదారి దెబ్బతినింది. కమ్మోళ్లపల్లె వద్ద ఏర్పాటు చేసిన అండర్ పాస్ రోడ్డులో నీరు నిలిచి నడిచేందుకు కూడా వీలు కావడంలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే బోనంవారిపల్లె–బండకిందపల్లె మధ్య రోడ్డు కోతకు గురైంది. బండకిందపల్లె వద్ద నీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన బాక్స్ టైప్ బ్రిడ్జిలో ఐదు అడుగుల లోతు నీరు నిలిచింది. ఈ క్రమంలో బండకిందపల్లెకు చెందిన విద్యార్థులు మట్లోళ్లపల్లె అండర్ పాస్ నుంచి రెండు కిలో మీటర్లు చుట్టి పాఠశాలకు చేరుకోవాల్సి వచ్చింది. బండకిందపల్లె వద్ద అండర్ పాస్ ఏర్పాటు చేస్తేనే విద్యార్థులను బడికి పంపుతామని తల్లిదండ్రులు స్పష్టం చేయడంతో స్థానిక అధికారులు నేషనల్ హైవే ఇంజినీర్లతో చర్చలు జరిపారు. బండకిందపల్లె వద్ద నీరు వెళ్లేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దానిపై ఇంతవరకు ఎలాంటి పనులూ చేపట్టలేదు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులకు విలువలు ఎంతో అవసరం



అవగాహన కల్పిస్తున్న జయరామిరెడ్డి

సదుం: విద్యార్థులకు విద్యతో పాటు విలువలు ఎంతో అవసరమని పూతలపట్టు రిటైర్డ్ టీచర్ జయరామిరెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు మానవీయ, నైతిక విలువల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విలువలతో కూడిన జీవితంలో సద్గుణాలు అలవడతాయన్నారు. విలువలతో జీవిస్తే జీవతం సుఖమయం అవుతుందన్నారు. ప్రిన్సిపాల్ వెంకటనాథరెడ్డి, లెక్చరర్లు బాలాస్వామి, సునీత, రాజీ, జగదీశ్, చెన్నారెడ్డి, భార్గవి, శేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్రిడ్జి కోర్సులు ఎంతో ఉపయోగం

పుంగనూరు: విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు బ్రిడ్జి కోర్సులు ఎంతగానో ఉపయోగపడతాయని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. కళాశాలలో బుధవారం మోటివేషనల్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీ పరీక్షల్లో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలను వివరించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్లు అనీల్ కుమార్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఈవో విచారణ

పుంగనూరు: పుంగనూరు మండల కార్యాలయంలో సునీల్ అనే కాంట్రాక్ట్ ఉద్యోగి రూ.1.36 కోట్ల నిధుల స్వాహా చేసిన విషయంపై డిప్యూటీ సీఈవో వెంకటనారాయణ బుధవారం విచారణ చేపట్టారు. గత ఏడాది జరిగిన నిధుల స్వాహాపై పూర్తి స్థాయి విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని పేర్కొన్నారు. వారి ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు వెంకటరమణారెడ్డి, రామమూర్తి, మున్నా

పుంగనూరు: పట్టణంలోని వినియోగదారులకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు పెట్టకుండా నిలుపుదల చేయాలని సీపీఐ నాయకులు వెంకటరమణారెడ్డి, రామమూర్తి, మున్నా డిమాండ్ చేశారు. వారు బుధవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కరెంటు చార్జీలను పెంచుతూ సామాన్యులపై అధిక భారం మోపుతోందని తెలిపారు. ప్రతి పక్షంలో వున్నప్పుడు స్మార్ట్ మీటర్లు పెడితే పగలగొట్టండి అని నారా లోకేష్ పిలుపునిచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత స్మార్ట్ మీటర్లు ఎలా బిగిస్తారని నిలదీశారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటులో ప్రజల నుంచి రూ.1500 కోట్లను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఈ డబ్బులు ఎవరికి వెళుతున్నాయని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఆపకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

లక్ష్మీనగర్‌లో సమస్యల తిష్ట

- చిన్నపాటి వర్షానికే వీధులు బురదమయం
- కాలువలు లేకపోవడంతో ఇళ్లు ముందే మురుగునీరు



బురదమయంగా మారిన వీధి



ఇళ్ల వద్ద నిలిచిన మురుగునీరు

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీనగర్‌లో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో దాదాపు 150కి పైగా కుటుంబాలు ఉన్నాయి. అనేక వీధులకు మురుగు కాలువలు లేవు. దీంతో ఇళ్ల ముందే మురుగు నీరు నిలిస్తోంది. దుర్గంధం వెదజల్లుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోమలు విజృంభించి జ్వరాలు ప్రబలుతున్నాయి. సిమెంట్ రోడ్లు లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే వీధులు బురదమయమవుతున్నాయి. ఫలితంగా వీధుల్లో నడిచి వెళుతూ కాలు జారి కింద పడుతున్నారు. వీధిలైట్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు మున్సిపాలిటీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు.